# బళ్లారి జీన్స్ ఆగమాగం

**ఇక, చాలు!**
ఎప్పుడో కట్టే కొత్త ప్రాజెక్టులు
తర్వాత..
ముందు కరెంటు ఇవ్వండి..
ఒకవైపు పండుగల సీజన్
అయిపోతుంది..
బట్టల ఆర్డర్లు మస్తు
పెండింగ్‌లో ఉన్నాయ్.
కరెంటు లేక, కార్మికులు
ఉత్తగనే ఉంటున్రు
ఇలాగే ఆలస్యం చేస్తే,
మా బతుకులు బజారు మీదకే
**– కర్ణాటక కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతూ బళ్లారి జీన్స్ వ్యాపారులు చేస్తున్న విజ్ఞప్తి ఇది**



- విద్యుత్తు కోతలతో నిలిచిపోయిన ఉత్పత్తి
- పెరిగిన ధరలతో ఇప్పటికే కుదేలైన రంగంపై కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు పోటు
- అనధికార విద్యుత్తు కోతలతో తగ్గిన ఉత్పత్తి
- పండుగ సమయంలో కోట్లాది ఆర్డర్లపై ఎఫెక్ట్
- రోడ్డున పడనున్న 60-80 వేల కుటుంబాలు
- కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతున్న వ్యాపారులు



బళ్లారిలో జీన్స్ ప్యాంట్లను తయారు చేస్తున్న కార్మికులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): కర్ణాటక కాంగ్రెస్ సర్కారు నిర్వాకంతో మొదలైన విద్యుత్తు కోతలు అటు రైతులనే కాదు ఇటు పారిశ్రామికవర్గాలనూ కలవరపెడుతున్నాయి. ఒకవైపు పెరిగిన ముడి సరుకు ధరలు, మరోవైపు సుంకాల వాత.. ఇంకోవైపు కేంద్రంలోని బీజేపీ సర్కారు అనాలోచిత నిర్ణయాలు వెరసి ఇప్పటికే కుదేలైన కర్ణాటకలోని బళ్లారి జీన్స్ పరిశ్రమపై కాంగ్రెస్ సర్కారు తాజాగా విద్యుత్తు పోటు పొడిచింది. రాష్ట్రంలో ఎడాపెడా విధిస్తున్న విద్యుత్తు కోతలతో జీన్స్ పరిశ్రమలో ఉత్పత్తి అంతకంతకూ పడిపోతున్నది. కొవిడ్-19 లాక్‌డౌన్ సంక్షోభంతో కుదేలైన పరిశ్రమ ఇప్పుడిప్పుడే కోలుకొంటున్నదని, ఇలాంటి సమయంలో అనధికారికంగా కరెంటు కోతలు విధించడం ఏమిటని పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు కాంగ్రెస్ సర్కారును నిలదీస్తున్నారు. దసరా, దీపావళి, క్రిస్మస్ పండుగ సీజన్లను దృష్టిలో పెట్టుకొని వేల కోట్ల విలువైన ఆర్డర్లను ఇప్పటికే ఒప్పుకొన్నామని, ఇలాంటి సమయంలో విద్యుత్తు కోతలు విధిస్తే, బట్టలను ఎలా డెలివరీ చేస్తామని మండిపడుతున్నారు.

**రాక-పోక తెలిస్తేగా?!**
పగటిపూట 6-12 గంటలపాటు, రాత్రిళ్లు దాదాపు పూర్తిగా కరెంటు కోతలు విధిస్తున్నట్టు చిన్న పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు. దీంతో మానవవనరుల వినియోగం వృథాగా పోతున్నట్టు మండిపడుతున్నారు. విద్యుత్తు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియట్లేదని చెబుతున్నారు. అటు పరిశ్రమలో పనిచేసే కార్మికులూ జీతాల గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు నెలకు ఇంతా అన్నట్టు వేతనం ఉండబోదని, రోజుకు సగటున 300-400 జత ప్యాంట్లను పూర్తిచేస్తేనే ఆ రోజు వేతనం పడుతుందని చెబుతున్నారు. ఇప్పుడు విద్యుత్తు కోతలతో పైసా కూడా రావట్లేదని వాపోతున్నారు. వచ్చే బడ్జెట్‌లో రూ. 5000 కోట్లతో బళ్లారిలో జీన్స్ పార్క్ ప్రారంభిస్తామని కాంగ్రెస్ సర్కారు ఆశలు చూపెడుతున్నదని, అయితే కొత్త ప్రాజెక్టులు ప్రారంభించడానికంటే ముందు విద్యుత్తు కోతల సమస్యను పరిష్కరించాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

**గతమెంతో వైభవం**
అప్పటివరకూ బెల్‌బాటమ్, ప్యారెలాల్ ప్యాంట్లనే ధరించిన భారతీయులకు జీన్స్‌ను పరిచయం చేసిన వాటిలో బళ్లారి జీన్స్ పరిశ్రమ ఒకటి. బళ్లారి ప్రాంతంలో పత్తి సాగు ఎక్కువ. ఇక్కడి నుంచి దక్షిణాదిలోని అనేక ప్రాంతాలకు రైలు సదుపాయం ఉంది. ఈ కారణంగానే బ్రిటిష్ పాలకులు సైన్యానికి ఇక్కడి నుంచి యూనిఫామ్‌లు కుట్టించి పంపేవారు. కాలగమనంలో రెడీమేడ్ దుస్తుల తయారీ కూడా ప్రారంభమైంది. తర్వాత ఇక్కడి వర్కర్లు వెస్టర్న్ స్టైల్ జీన్స్ పాంట్లు, చొక్కాల తయారీ ప్రారంభించారు. వీటి విక్రయాలు గణనీయంగా పుంజుకొన్నాయి. అయితే, చిన్న యంత్రాలతో ఉత్పత్తి నెమ్మదిగా సాగుతుండటంతో పరిశ్రమ నవీకరణకు, పెద్ద యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం ముందుకురావాలని ఇక్కడి కార్మికులు 2017, 2018లో కేంద్రప్రభుత్వానికి, పరిశ్రమల శాఖకు వినతి పత్రాలు అందించారు. అయితే, దీన్ని పట్టించుకోని కేంద్రం.. ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జీన్స్ అపారెల్ పార్కును ప్రారంభించింది. ఈ దెబ్బతో కుదేలైన బళ్లారి జీన్స్ పరిశ్రమపై కరోనా సంక్షోభం మరింత ప్రభావం చూపింది. లాక్‌డౌన్ అనంతరం ఇప్పుడిప్పుడే కోలుకొంటున్న పరిశ్రమపై కరెంటు కోతల రూపంలో కాంగ్రెస్ సర్కారు మరో పిడుగు వేసింది.

### రోడ్డున పడటం ఖాయం



బళ్లారి జీన్స్ తయారీ రంగంపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 60 వేల నుంచి 80 వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. కొవిడ్ లాక్‌డౌన్, కేంద్రంలోని బీజేపీ సర్కారు నుంచి తగిన ప్రోత్సాహకం లేకపోవడం, పెరిగిన ముడి సరుకు ధరలు, సుంకాలు వెరసి గడిచిన రెండు, మూడేండ్లలోనే జీన్స్ ఉత్పత్తి, అమ్మకాలు 40% వరకూ తగ్గాయి. ఈ పండుగ సీజన్‌లోనైనా నాలుగు రాళ్లు వెనుకేసుకుందామంటే, రాష్ట్రంలో ఎడాపెడా విధిస్తున్న విద్యుత్తు కోతలు మా ఆశలను అడియాశలు చేస్తున్నాయి. నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేయాలి. లేకపోతే, వేల కుటుంబాలు రోడ్డున పడటం ఖాయం.
**–పోలక్స్ మల్లికార్జున, జీన్స్ వ్యాపారి, బళ్లారి, కర్ణాటక**



## ఈసీ నేషనల్ ఐకాన్‌గా రాజ్‌కుమార్ రావు

న్యూఢిల్లీ: ప్రముఖ నటుడు రాజ్‌కుమార్ రావును భారత ఎన్నికల సంఘం (ఈసీ) నేషనల్ ఐకాన్‌గా నియమించింది. ఎన్నికలలో ఓటు వేసేలా ప్రజలను చైతన్య పరిచేందుకు ఈసీ దేశంలోని ప్రముఖులను నేషనల్ ఐకాన్లుగా నియమిస్తుంది. అందులో భాగంగా 'న్యూటన్' అనే హిందీ చిత్రంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో స్వేచ్ఛ, పారదర్శకతతోఎన్నికలు నిర్వహించే ప్రభుత్వ అధికారి పాత్రను పోషించిన రాజ్‌కుమార్ రావును ఈసీ నేషనల్ ఐకాన్‌గా ఎంపిక చేసినట్టు ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ గురువారం ప్రకటించారు.

## రాజకీయ లబ్ధికి సైన్యాన్ని వాడుకుంటారా?

**కేంద్రప్రభుత్వ చర్యలపై రక్షణ నిపుణుల ఆగ్రహం**

చండీగఢ్: దేశ సైన్యాన్ని రాజకీయికరణ చేసేందుకు బీజేపీ ప్రభుత్వం బహిరంగంగా చేస్తున్న ప్రయత్నాలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాజీ సైనికాధికారులు, రక్షణ నిపుణులు, విపక్ష నేతలు కేంద్ర ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నారు. 14.5 లక్షల మంది సైనికులు గల బలమైన భారత ఆర్మీని కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం రాజకీయంగా దుర్వినియోగం చేస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. 'రానున్న శాసనసభ, లోక్‌సభ ఎన్నికల రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రం సిగ్గు లేకుండా సైన్యం సేవలను దుర్వినియోగపరుస్తున్నది' అని ఒక రిటైర్డ్ ఆర్మీ అధికారి వ్యాఖ్యానించారు. రాజకీయ ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకొనేందుకు సిద్ధంగా ఉన్న కొందరు ఆర్మీ ఉన్నతాధికారుల అంగీకారంతో ఇలాంటి చర్యలు అమలవుతున్నాయని ఆయన ఆవేదన వ్యకం చేశారు.

## తమిళ గవర్నర్ నివాసంపై పెట్రోల్ బాంబు

చెన్నై: తమిళనాడు గవర్నర్ నివాసమైన రాజ్‌భవన్‌పైకి ఓ వ్యక్తి పెట్రోల్ బాంబును విసిరాడు. ఇది రాజ్‌భవన్ మెయిన్ గేట్ వద్ద పడింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆ వ్యక్తి గవర్నర్ ఆర్ ఎన్ రవికి వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. నీట్ పరీక్షకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన తీర్మానంపై గవర్నర్ సంతకం పెట్టడం లేదని నినదించాడు.

## సొంత సోదరుడినే ట్రాక్టర్‌తో తొక్కించి హత్య

**నేరాన్ని ఫోన్‌లో చిత్రీకరించిన స్థానికులు**


జైపూర్, అక్టోబర్ 25: భూ వివాదంలో సొంత సోదరుడినే ట్రాక్టర్‌తో తొక్కి హతమార్చిన ఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకున్నది. భరత్‌పూర్ జిల్లాలో ఇద్దరు సోదరుల మధ్య కొద్ది రోజులుగా భూ వివాదం నడుస్తున్నది. దీంతో సోదరుడని కూడా చూడకుండా ట్రాక్టర్‌ని పలుసార్లు మీద ఎక్కించి హతమార్చాడు తోబుట్టువు. అయితే అక్కడున్నవాళ్లు సర్దిచెప్పకుండా ఘటనను సెల్‌ఫోన్లలో చిత్రీకరించడంలో మునిగిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.



# నిరుద్యోగ భారతం

**భారతీయ యువతలోనే నిరుద్యోగిత రేటు అధికం**
**పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్ ఎంతో మెరుగు**
**ప్రపంచబ్యాంకు నివేదిక**

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: కేంద్రంలోని మోదీ సర్కారు పాలనలో భారత్ అన్ని రంగాల్లోనూ తిరోగమనం చెందుతున్నది. ప్రపంచ ఆకలి సూచీలో భారత్ అట్టడుగున నిలిచినట్లు ఇటీవలి నివేదికలో వెల్లడైన విషయం తెలిసిందే. పొరుగుదేశాలతో పోలిస్తే భారత యువతలో నిరుద్యోగిత రేటు అధికంగా ఉన్నట్టు ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది. భారత్‌తో పోలిస్తే పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్‌లో పరిస్థితులు మెరుగ్గా ఉన్నట్టు పేర్కొన్నది.




**36%** దేశంలో నిరుద్యోగం అతిపెద్ద సమస్యని 15-34 ఏండ్ల వయస్కుల్లో సుమారు 36 శాతం మంది అభిప్రాయపడ్డారు. లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది.

## మరాఠా కోటా కోసం మళ్లీ నిరాహార దీక్ష

ముంబై, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మనోజ్ జరాంగే మళ్లీ నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. రిజర్వేషన్ల అమలు కోసం కొంత సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో జరాంగే ఇటీవల 40 రోజుల సమయం ఇచ్చారు. గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం రిజర్వేషన్లను అమలు చేయకపోవడంతో బుధవారం మళ్లీ జాల్నా జిల్లాలోని తన స్వగ్రామంలో నిరవధిక నిరాహార దీక్షకు కూర్చొన్నారు. జరాంగే మళ్లీ దీక్ష చేపట్టడంతో సీఎం ఏక్‌నాథ్‌షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ అకస్మాత్తుగా ఢిల్లీకి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

# సాయమేది చౌహాన్?

- ఉజ్జయినిలో బాలికపై లైంగికదాడి జరిగి నెలరోజులు
- నాడు బాధితురాలిని ఆదుకుంటామన్న ముఖ్యమంత్రి
- నేడు మీడియాకు 'నమస్కారం' పెట్టి పలాయనం
- ఆ కుటుంబానికి అందింది అక్షరాలా రూ.2100 మాత్రమే
- దళితులపై దాడుల్లో దేశంలోనే మధ్యప్రదేశ్‌కు మొదటిస్థానం



చౌహాన్


భోపాల్, అక్టోబర్ 25: సరిగ్గా నెల రోజుల క్రితం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఓ హృదయవిదారకమైన దృశ్యం దేశం మొత్తాన్ని కుదిపివేసింది. ఓ పదిహేనేండ్ల బాలిక రక్త మోడుతూ.. అర్ధనగ్నంగా రోడ్లపై తిరుగుతూ.. సహాయం చేయమని ప్రతి ఇంటి తలుపు కొడుతూ, కనిపించిన వారినందరినీ యాచించిన ఘటన ఎందరినో కంటతడి పెట్టించింది. అసెంబ్లీ ఎన్నికల ముంగిట జరిగిన ఈ ఉదంతం తమ ప్రభుత్వ పనితీరుకు మాయని మచ్చగా మిగులుతుందని భావించిన రాష్ట్రంలోని బీజేపీ సర్కారు ఆ బాలికను ఆదుకొనే విషయమై భారీ హామీలు గుప్పించింది. ఆ బాలిక ప్రస్తుతం ఇంటికి చేరి.. ఆరోగ్యం కొంత కుదుటపడుతున్నప్పటికీ.. ప్రభుత్వాధినేతలు చేసిన శుష్క వాగ్దానాల గాయం మాత్రం ఆమెను ఇంకా వేధిస్తున్నది. తాము తక్కువ (దళిత) కులానికి చెందిన వారమైనందునే తమకు ఎవరూ సాయం చేయలేదని ఆ బాలిక సోదరుడు అన్నారు. ఆ చిన్నారిపై లైంగికదాడికి పాల్పడిన ఆటోడ్రైవర్‌ను అరెస్టు చేసినప్పుడు సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పందిస్తూ.. 'ఆ అమ్మాయి ఈ రాష్ట్రం బిడ్డ, ఆమెను అన్ని విషయాలలో ఆదుకుంటాం' అని చెప్పారు. దీనిపై ఎన్డీటీవీ ప్రతినిధి బుధవారంనాడు సీఎం చౌహాన్‌ను ప్రశ్నించగా.. 'నమస్కారం' అంటూ తప్పించుకున్నారు. తాము దవాఖాన నుంచి తిరిగి వచ్చిన తరువాత తమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి వచ్చి రూ.1,500 ఇచ్చి వెళ్లారని బాలిక బంధువు ఒకరు తెలిపారు. ఇక ప్రభుత్వం నుంచి సామాజిక న్యాయం పెన్షన్ కింద మరో రూ.600 ఇచ్చారని చెప్పారు. ఇప్పటివరకు బాలికకు అందింది రూ.2100 మాత్రమే.

**దళితులపై నేరాల్లో మధ్యప్రదేశ్ మొదటిస్థానం**

- **50,900– 2021లో** దేశవ్యాప్తంగా దళితులపై చోటుచేసుకున్న దాడులు
- **7211**– ఒక్క మధ్యప్రదేశ్‌లోనే దళితులపై జరిగిన దాడులు
- **25.3%**– దేశంలో దళితులపై జరిగిన నేరాల రేటు
- **63.6%**– మధ్యప్రదేశ్‌లో దళితులపై జరిగిన నేరాల రేటు

# హామీలకు మంగళం

- హిమాచల్‌లో కాంగ్రెస్ సర్కారు మోసం
- ఏడాదైనా 10 హామీల ఊసెత్తని హస్తం పార్టీ
- ఉచిత విద్యుత్తు, మహిళలకు భృతి, ఉద్యోగాల హామీలు గాలికి..




(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): కిందటేడాది హిమాచల్‌ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. ఇచ్చిన 10 ప్రధాన హామీలను ఇప్పటికీ అమలు చేయట్లేదు. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు నెలకు రూ.1,500 జీవన భృతి చెల్లిస్తామని, పాడి రైతుల దగ్గర ఆవుపాలను లీటరుకు రూ.80కి చొప్పున, గేదె పాలు లీటరుకు రూ.100 చొప్పున కొనుగోలు చేస్తామంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టింది. ఆఖరుకు ఆవుపేడను కూడా కిలో రూ.2 చొప్పున కొనుగోలు చేస్తామని మాటిచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిలో ఏ ఒక్కదాన్ని కూడా ప్రభుత్వం అమలులోకి తీసుకురాలేదు.

**ఉచిత విద్యుత్తు ఇలా..**
పగ్గాలు చేపట్టిన వెంటనే.. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును సరఫరా చేయడం పక్కకు పెట్టిన కాంగ్రెస్.. విద్యుత్తు చార్జీలు యూనిట్‌కు 86 పైసలు చొప్పున పెంచింది. అంతేకాకుండా, జలవిద్యుత్తు కేంద్రాల మీద జలవినియోగ పన్ను విధించింది. దీంతో ఈ భారం అంతిమంగా వినియోగదారులపైనే పడింది. ఆగ్రహించిన హక్కుల కార్యకర్తలు ఉచిత విద్యుత్తు హామీని ఎప్పుడు నెరవేరుస్తారని సర్కారును నిలదీస్తే, 'ఇంకా సమయం ఉందిగా.. మరో మూడేండ్లలో అమలు చేస్తాంలే' అంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ ఏకంగా రాష్ట్ర శాసనసభలోనే చెప్పుకొచ్చారు.

**మహిళలకు భ్రమగా మారిన భృతి**
రాష్ట్రంలో 2.35 లక్షల మంది మహిళలకు భృతిని వర్తింపచేస్తామని ఊరించిన హస్తం పార్టీ.. చివరకు లాహల్ స్పితి అనే ఒకే ఒక్క జిల్లాలో ఓ మారుమూల ప్రాంతానికి మాత్రమే ఈ పథకాన్ని పరిమితం చేసింది. అదీ పైలట్ ప్రాజెక్టుగా కేవలం 9 వేల మంది మహిళలకే స్కీమ్‌ను కొన్ని నెలలకే వర్తింపజేసింది. టిబెట్ సరిహద్దుల్లో జనసాంద్రత చదరపు కిలోమీటరుకు కేవలం ఇద్దరు మాత్రమే ఉన్న ఈ జిల్లాను ప్రభుత్వం ఎంచుకోవడం ప్రజలను వంచించడమేనని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి.

**మిగిలిన హామీల సంగతీ అలాగే..**
ఆవులు, గేదెల పాల ధర పెంపు విషయంలోనూ కాంగ్రెస్ మాటతప్పింది. ఆవుపేడ కొనుగోలునూ ప్రకటనలకే పరిమితం చేసింది. పాత పింఛను విధానం పునరుద్ధరణ హామీని తప్పింది. 5 లక్షల ఉద్యోగాల భర్తీని గాలికొదిలేసి రిక్రూట్‌మెంట్‌నే నిలిపేసింది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణను మరిచింది. డ్రగ్స్‌పై ఉక్కుపాదం, ఉద్యోగులకు 14 శాతం డీఏ, ఆపిల్ సాగుదారులకే ధరల నిర్ణయాధికారం వంటి హామీలను తుంగలో తొక్కింది. యువతకు 680 కోట్ల స్టార్టప్ ఫండ్ స్కీమ్ ఇంకా ప్రారంభమే కాలేదు. వడ్డీలేని రుణాలుతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 4 ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు, సంచార వాహనాలతో ప్రతి గ్రామనికి వైద్య సౌకర్యం ఇలా అన్ని హామీలను అటకెక్కించింది.

## ఇద్దరు ఇండో అమెరికన్లకు యూఎస్ అవార్డులు

వాషింగ్టన్, అక్టోబర్ 25: సైన్స్, టెక్నాలజీ రంగాల్లో విశేష కృషి చేసిన ఇద్దరు ఇండో అమెరికన్ శాస్త్రవేత్తలను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆ దేశ అత్యున్నత శాస్త్రీయ అవార్డులతో గౌరవించారు. సివిల్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్‌లో విశేష కృషి చేసిన గాడ్గిల్‌కు వైట్ హౌస్ నేషనల్ మెడల్‌ను, ఇంజనీరింగ్ ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్సెలలో చేసిన పరిశోధనలకు సుబ్రా సురేష్‌కు నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్‌ను బైడెన్ మంగళవారం అందజేశారు.

## ఈబీ-2, ఈబీ-3 గ్రీన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించం: అమెరికా

వాషింగ్టన్: అమెరికాలో శాశ్వత నివాస హోదా (గ్రీన్‌కార్డు) కోసం ఎదురుచూస్తున్న భారతీయులకు బైడెన్ ప్రభుత్వం చేదువార్త చెప్పింది. 2024 ఆర్థిక సంవత్సరం నుంచి ఈబీ-2, ఈబీ-3 (ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్-2, 3) క్యాటగిరీల్లో భారతీయుల నుంచి గ్రీన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించబోమని ప్రకటించింది. ఈ రెండు క్యాటగిరీల్లో గ్రీన్‌కార్డులకు నిరీక్షణ సమయం నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. ప్రస్తుతం దాదాపు 11 లక్షల మంది భారతీయులు గ్రీన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని, వీరిలో ఈబీ-2, ఈబీ-3 క్యాటగిరీలకు చెందినవారే అత్యధికంగా ఉన్నారని తెలిపింది. అమెరికాలో గ్రీన్‌కార్డుల కోసం వేచిచూస్తున్న వారిలో భారతీయులే అత్యధికం.

## కెనడాలో భారత్ వీసా సేవల పునరుద్ధరణ

టొరంటో: ఇటీవల భారత్-కెనడా మధ్య ఏర్పడిన దౌత్య ప్రతిష్టంభనతో కెనడాలో నిలిపివేసిన వీసా సేవలలో కొన్నింటిని గురువారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు భారత్ బుధవారం ప్రకటించింది. కెనడా ప్రభుత్వం ఇటీవల చేసిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సమీక్షించిన అనంతరం ఇంచుమించు నెల రోజుల తర్వాత ఈ నెల 26 నుంచి ఎంట్రీ వీసా, బిజినెస్ వీసా, మెడికల్ వీసా, కాన్ఫరెన్స్ వీసా సర్వీసులను పునరుద్ధరిస్తున్నట్టు ఒట్టావాలోని భారత హై కమిషన్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.



## చర్మ క్యాన్సర్‌తో పోరాడే సబ్బు

వాషింగ్టన్, అక్టోబర్ 25: అమెరికాకు చెందిన 14 ఏండ్ల హెమన్ బెకెలె అనే బాలుడు చర్మ క్యాన్సర్‌తో పోరాడే సబ్బును కనుగొన్నాడు. తద్వారా '3ఎమ్ యంగ్ సైంటిస్ట్ ఛాలెంజ్'లో విజేతగా నిలిచి 25 వేల డాలర్ల గ్రాండ్ ప్రైజ్ దక్కించుకొన్నాడు. ఈ సబ్బులోని పదార్థాలు చర్మాన్ని రక్షించే కణాలను చైతన్యవంతం చేసి క్యాన్సర్ కణాలతో పోరాడేలా చేస్తాయి. ఈ సబ్బు ధర 10 డాలర్లకంటే తక్కువని బెకెలె తెలిపాడు.

## కేరళ గబ్బిల్లాల్లో నిపా వైరస్!

తిరువనంతపురం, అక్టోబర్ 25: కేరళలోని కోజికోడ్ జిల్లాను గత నెలలో నిపా వైరస్ భయపెట్టిన ఘటన మరువకముందే వయనాడ్ జిల్లాల్లోని గబ్బిల్లాల్లో నిపా వైరస్ పాజిటివ్ లక్షణాలున్నట్టు వెల్లడైంది. ఐసీఎంఆర్ జరిపిన పరీక్షల్లో ఈ విషయం వెల్లడైందని కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ బుధవారం తెలిపారు. 'రోగులను పరీక్షించేటప్పుడు ఏ చిన్న అనుమానం వచ్చినా డాక్టర్లు జాగ్రత్త వహించాలి' అని ఆమె కోరారు. నిపా వైరస్ లక్షణాల వల్ల గత నెలలో కేరళలో ఇద్దరు రోగులు చనిపోయినట్టు డాక్టర్లు భావించారు.

## పాఠ్యపుస్తకాల్లో ఇండియాకు బదులుగా భారత్

- మార్పునకు ఎన్సీఈఆర్టీ కమిటీ సిఫారసు
- ప్రాచీన చరిత్ర స్థానంలో క్లాసికల్ హిస్టరీ
- ఇండియన్ నాలెడ్జ్ సిస్టంకు కూడా సిఫారసు

న్యూఢిల్లీ: దేశం పేరు మార్పుపై ఇప్పటికే కేంద్రం స్పష్టమైన సంకేతాలిచ్చిన నేపథ్యంలో 'ఇండియా' పేరును పూర్తిగా తుడిచిపెట్టేసే పని ఊపందుకొన్నది. కొత్త తరానికి దేశ చరిత్ర, సంస్కృతులను పరిచయం చేసే పాఠశాల పాఠ్య పుస్తకాల నుంచి ఇండియా పేరును తీసేసి 'భారత్' అని చేర్చాలని జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థ (ఎన్సీఈఆర్టీ) కమిటీ సిఫారసు చేసింది. పాఠశాల స్థాయిలో అన్ని తరగతుల పాఠ్యపుస్తకాల్లోనూ 'ఇండియా'ను 'భారత్'గా మార్చటంతోపాటు 'ప్రాచీన చరిత్ర' స్థానంలో 'క్లాసికల్ హిస్టరీ'ని ప్రవేశపెట్టాలని, ప్రత్యేకంగా 'ఇండియన్ నాలెడ్జ్ సిస్టం' (ఐకేఎస్)ను తీసుకురావాలని సిఫారసు చేసినట్టు కమిటీ చైర్‌పర్సన్ సీఐ ఐసాక్ తెలిపారు. అయితే, కమిటీ సిఫారసుపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఎన్సీఈఆర్టీ చైర్మన్ దినేష్ సక్లానీ వెల్లడించారు. భారత్ అనే పేరు 7 వేల ఏండ్ల పురాతనమైన విష్ణు పురాణంలో ఉపయోగించారని, అందుకే దేశాన్ని ఆ పేరుతో సంబోధించాలని సూచించినట్టు ఐసాక్ తెలిపారు.

**ప్రతిపక్షాల ఆగ్రహం**
ఎన్సీఈఆర్టీ సిఫారసుపై ప్రతిపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'ఇండియాను భారత్‌గా మార్చుతున్నట్టయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్, ఇండియన్ ఫారిన్ సర్వీస్‌ను ఎందుకు కొనసాగిస్తున్నాం. ఎన్సీఈఆర్టీ ప్రతిపాదన పూర్తిగా ప్రజావ్యతిరేకం. ఎన్డీఏ సర్కారు వారిపై ఒత్తిడి తెచ్చింది' అని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆరోపించారు. విపక్ష కూటమికి ఇండియా అని పేరుపెట్టినప్పటి నుంచి అధికార బీజేపీలో భయం మొదలైందని ఆర్‌జేడీ ఎద్దేవా చేసింది.

## జమిలి ఎన్నికలపై రోడ్‌మ్యాప్

**కోవింద్ కమిటీకి సమర్పించిన లా కమిషన్**

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: దేశంలో జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాల పరిశీలనకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీతో లా కమిషన్ బుధవారం భేటీ అయ్యింది. దేశంలో లోక్‌సభ, అసెంబ్లీ, మున్సిపల్, పంచాయతీలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగంలో చేయాల్సిన మార్పులు, చేర్పులను వివరించడమే కాక, జమిలి ఎన్నికలకు సంబంధించి రోడ్‌మ్యాప్‌ను సమర్పించింది. అయితే ఏకకాల ఎన్నికలకు సంబంధించి లా కమిషన్ తన నివేదికను ఇంకా పూర్తి చేయలేదని తెలిసింది.